వృద్ధికి కార్పొరేట్ జోష్

ప్రైవేట్ పెట్టుబడులే జీడీపీకి ఇంధనం • ఆర్బీఐ బులెటిన్

ముంబై, ఫిబ్రవరి 20: కార్పొరేట్ రంగం నుంచి వచ్చే కొత్త పెట్టుబడి వ్యయం.. దేశ జీడీపీ వృద్ధిరేటును మరింత బలోపేతం చేసే వీలుందని తాజా బులెటిన్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అభిప్రాయపడింది. ప్రైవేట్ పెట్టుబడులే వృద్ధిరేటుకు ఇంధనంగా అభివర్ణించింది. తక్కువ స్థాయిలో 4 శాతంతో స్థిరంగా ఉండే ద్రవ్యోల్బణం.. నిలకడైన జీడీపీ విస్తరణకు పునాదిగా మారగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను చివరి, ఆరో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఈ నెలారంభంలో ఆర్బీఐ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆర్బీఐ ఫిబ్రవరి బులెటిన్ విడుదలైంది. ఇందులో 'దేశ ఆర్థిక వ్యవస్థ' పేరుతో వచ్చిన ఆర్టికల్‌లో ఈ ఏడాది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి ఊహించినదానికంటే బలంగా ఉండవచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. ఇటీవలి నెలల్లో ఈ సంకేతాలున్నాయన్నది. ఇక దేశ ఆర్థిక వ్యవస్థ నిలకడైన తీరు.. ఈ 2023-24 ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్)లోనూ కొనసాగినట్టు చెప్పింది. ఈ నేపథ్యంలోనే 'తదుపరి జీడీపీ వృద్ధికి కార్పొరేట్లు చేసే తాజా మూలధన వ్యయం ఇంధనం కాగలదు' అని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్లలో ఒకరైన మైఖేల్ దేబబ్రత పాత్ర అన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా నైతే ప్రైవేట్ రంగంలో పెట్టుబడుల ఆలోచనలు అనుకూలంగానే ఉన్నట్టు చెప్తున్నారు.

రూ.2.4 లక్షల కోట్లు

గత ఏడాది ఏప్రిల్-డిసెంబర్ వ్యవధిలో ప్రధాన బ్యాంకులు/అఖిల భారత ఆర్థిక సంస్థలు జారీ చేసిన రుణాలకు సంబంధించిన ప్రాజెక్టుల మొత్తం విలువ రూ.2.4 లక్షల కోట్లుగా ఉన్నది. 2022 ఏప్రిల్-డిసెంబర్‌తో పోల్చితే ఇది 23 శాతం ఎక్కువ. ఇక ఈ ఆర్థిక సంవత్సరం రెండో, మూడో త్రైమాసికంలో పెట్టుబడుల కోసం ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ (ఈసీబీలు), ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపీవో) చురుగ్గా సాగినట్టు ఆర్బీఐ బులెటిన్ పేర్కొన్నది. అయితే తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో సమీకరించిన నిధులతో పోల్చితే తక్కువేనని స్పష్టం చేసింది. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను దేశ జీడీపీని ఆర్బీఐ 7 శాతంగా అంచనా వేసింది. అలాగే వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 4.5 శాతంగా ఉండొచ్చన్నది. అయినప్పటికీ ఆహారోత్పత్తుల ధరల్లో తరచూ చోటుచేసుకుంటున్న పెరుగుదలతో ఇబ్బందేనని ఆర్బీఐ వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్లు, వస్తూత్పత్తి ధరల్లో ఒడుదొడుకులూ సమస్యల్ని పెద్దవి చేస్తున్నట్టు పేర్కొన్నది. ఈ నెల ద్రవ్యసమీక్షలోనూ ఆర్బీఐ కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచినది తెలిసిందే. రెపోరేటును 6.5 శాతం వద్దే ఉంచగా, రుణ భారం తగ్గేందుకు ఇక ముందు ద్రవ్యసమీక్షల్లోనైనా వడ్డీరేట్ల కోతకు దిగాలని కార్పొరేట్లు కోరుతున్నారు.

ఐఎంఎఫ్ అంచనాతో విభేదం

దేశ డెట్-జీడీపీ నిష్పత్తిపై అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) అంచనాల్ని ఆర్బీఐ తోసిపుచ్చింది. 2030-31 నాటికి జనరల్ గవర్నమెంట్ డెట్-జీడీపీ రేషియో 73.4 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేబబ్రత పాత్ర అన్నారు. ఐఎంఎఫ్ దీన్ని 78.2 శాతంగా అంచనా వేసింది. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ స్థూల ద్రవ్య లోటును దేశ జీడీపీలో 5.1 శాతంగా అంచనా వేశారు. 2025-26లో దీన్ని జీడీపీలో 4.5 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

గేమర్ల కోసం ఆసుస్ రెండో స్టోర్

హైదరాబాద్, ఫిబ్రవరి 20: ప్రముఖ ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ సంస్థ ఆసుస్ ఇండియా..గేమర్ల కోసం హైదరాబాద్‌లో రెండో రిపబ్లిక్ ఆఫ్ గేమర్స్(ఆర్ వోజీ) స్టోర్‌ను ప్రారంభించింది. 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌లో కంపెనీకి చెందిన ఉత్పత్తులు నోట్‌బుక్స్, ఆర్‌వోజీ పీసీలు, ల్యాప్‌టాప్‌లు, ఆల్-ఇన్-వన్ పీసీలు, యాక్సెసరీస్‌లను డిస్‌ప్లే చేసింది. దేశవ్యాప్తంగా గేమింగ్‌లు ఆడేవారి సంఖ్య భారీగా పెరుగుతున్న నేపథ్యంలో వీరి కోసం ప్రత్యేకంగా జోన్‌ను ఏర్పాటు చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దీంతో హైదరాబాద్‌లో సంస్థ ఏర్పాటు చేసిన నాలుగో సెంటర్ ఇదని కంపెనీ సేవ నల్ సేల్స్ మేనేజర్ జిగ్నేష్ భావ్‌సర్ తెలిపారు. మెట్రో నగరాలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు సైతం వ్యాపారాన్ని విస్తరించనున్నట్లు, ఇందు కోసం టచ్‌పాయింట్లను సైతం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

పీసీలకు తగ్గుతున్న డిమాండ్

2023లో 6.6 శాతం క్షీణించిన విక్రయాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: దేశవ్యాప్తంగా పర్సనల్ కంప్యూటర్లకు డిమాండ్ పడిపోతున్నది. గడిచిన సంవత్సరంలో 1.39 కోట్ల పర్సనల్ కంప్యూటర్లు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది అమ్ముడైన దాంతో పోలిస్తే 6.6 శాతం తగ్గినట్లు ఇంటర్నేషనల్ డాటా కార్పొరేషన్(ఐడీసీ) తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. పర్సనల్ కంప్యూటర్లలో డెస్క్‌టాప్, నోట్‌బుక్స్‌లు ఉన్నాయి. కంపెనీల పరంగా చూస్తే హెచ్‌పీ తొలి స్థానంలో నిలిచినట్లు పేర్కొంది. 2023లో డెస్క్‌టాప్ విభాగం 6.7 శాతం వృద్ధిని కనబరుచగా..నోట్‌బుక్స్ 11.1 శాతం తగ్గగా, వర్క్‌స్టేషన్లు 14 శాతం చొప్పున తగ్గాయని వెల్లడించింది. కరోనా తర్వాత పీసీల కొనుగోలు చేయడానికి కష్టమర్లు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో డిమాండ్ పడిపోయిందని ఐడీసీ ఇండియా సీనియర్ రీసర్చ్ హెడ్ భరత్ తెలిపారు.

- 2023 ప్రథమార్ధంతో పోలిస్తే ద్వితీయార్ధంలో పీసీల అమ్మకాలు 12.9 శాతం చొప్పున పెరిగాయి. నాలుగో త్రైమాసికం(అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలం)లో డెస్క్‌టాప్స్, నోట్‌బుక్స్ విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 16.8 శాతం చొప్పున పెరిగాయి.
- 31.5 శాతం మార్కెట్ వాటాతో హెచ్‌పీ తొలిస్థానంలో నిలిచింది. కమర్షియల్ సెగ్మెంట్‌లో 33.6 శాతం, కన్జ్యూమర్ సెగ్మెంట్‌లో 29.4 శాతం వాటా కలిగివున్నది.
- 16.7 శాతంతో లెనోవా రెండో స్థానంలో నిలువగా, డెల్ టెక్నాలజీ 15.5 శాతంతో మూడోస్థానంలో నిలిచాయి.

బెర్రీలపై దిగుమతి సుంకం తగ్గింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: విదేశాల్లో పండించే పండ్లు బ్లూబెర్రీలు, క్రాన్‌బెర్రీలపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని భారీగా 30 శాతం నుంచి 10 శాతానికి తగ్గించింది. అలాగే మాంసం, టర్కీ కోళ్ల ఫ్రోజెన్ మాంసం దిగుమతులపై సుంకాన్ని 30 శాతం నుంచి 5 శాతానికి దించింది. భారత్-యూఎస్‌ల మధ్య ఇటీవల కుదిరిన పరస్పర అంగీకార ఒప్పందానికి లోబడి కేంద్ర వాణిజ్య శాఖ సిఫార్సుల మేరకు సుంకాలను తగ్గించినట్టు తాజా మార్పులు తక్షణం అమల్లోకి వస్తాయని అధికారులు తెలిపారు. గత వివాదాలను పరిష్కరించుకోవాలన్న నిర్ణయంలో భాగంగా ఇటీవలి జీ20 నేతల సదస్సులో భారత్-అమెరికాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందం చేసుకున్నాయని, ఈ మేరకు కొన్ని ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాల్ని తగ్గించిందని నంగియా యాండర్సన్ ఇండియా అసోసియేట్ డైరెక్టర్ (ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్) కుషబు త్రివేది వివరించారు. భారత్‌లో అరుదుగా దిగుబడి అయ్యే ఈ ఐటెమ్స్‌పై సుంకాలు తగ్గినందున, భారత్ మార్కెట్లోకి యూఎస్ విస్తరించడంతో పాటు ఈ ఉత్పత్తుల ధరలు కూడా దేశంలో తగ్గుతాయని త్రివేది చెప్పారు. అలాగే డబ్ల్యూటీవోలో భాగమైన ఇతర దేశాలకు మూడా ఈ చర్య ప్రయోజనం చేకూరుస్తుందన్నారు.

పొడుగుపింజ పత్తిపై సుంకం ఎత్తివేత

కాటన్ వస్త్రాల తయారీ పరిశ్రమ లేవనెత్తిన ఆందోళనల నేపథ్యంలో పొడుగుపింజ పత్తిపై దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తివేసింది. 32ఎంఎం కంటే పొడవైన పత్తి దిగుమతులకు సుంకం 'నిల్' అని వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

పెరగనున్న హోటల్ పరిశ్రమ ఆదాయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశీయ హోటల్ పరిశ్రమ 7-9 శాతం మధ్యలో ఆదాయ వృద్ధిని సాధించనున్నదని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేస్తున్నది. గడిచిన పదేండ్లుగా తక్కువ స్థాయిలో ఆదాయ వృద్ధిని నమోదు చేసుకుంటున్న హోటల్ పరిశ్రమ మాత్రం వచ్చే ఏడాది ఇంతకంటే అధిక వృద్ధిని నమోదు చేసుకోనున్నదని పేర్కొంది. పర్యాటకుల సంఖ్య పెరుగుతుండటం, అత్యధికంగా సమావేశాలు జరుగుతుండటం, ఇన్సెంటీవ్స్, సమావేశాలు, ఎగ్జిబిషన్లు, పెళ్లిళ్లు, ఆధ్యాత్మిక, బిజినెస్ పర్యటనలు పెరుగుతుండటం ఇందుకు కారణమని విశ్లేషించింది. దేశవ్యాప్తంగా ప్రీమియం హోటళ్లలో సరాసరి గది రేటు రూ.7,200-7,400 నుంచి రూ.7,800-8 వేల వరకు పెరిగే అవకాశం ఉన్నదని తెలిపింది.

17 కోట్లకు ఫండ్స్ ఖాతాలు

జనవరిలో 46.7 లక్షల ఇన్వెస్టర్లు జత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: మ్యూచువల్ ఫండ్స్‌లో మదుపుచేసే ఇన్వెస్టర్ల సంఖ్య జోరుగా పెరుగుతున్నది. ఈ మదుపు సాధనం పట్ల అవగాహన పెరగడం, డిజిటలైజేషన్‌తో లావాదేవీలు సులభతరంకావడంతో ఫండ్స్ మదుపుదారులను ఆకర్షించగలుగుతున్నాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫి) తాజా గణాంకాల ప్రకారం ఈ ఏడాది జనవరిలో మ్యూచువల్ ఫండ్ పరిశ్రమకు కొత్తగా 46.7 లక్షల ఇన్వెస్టర్ల ఖాతాలు జతయ్యాయి. ఏడాది క్రితం సగటున నెలకు 22.3 లక్షల ఫోలియోలు జతకాగా, ఈ జనవరిలో అంతకు రెట్టింపు తెరవడం గమనార్హం. కొత్తగా తెరిచిన ఖాతాలతో మొత్తం మ్యూచువల్ ఫండ్స్ ఫోలియోలు 16.96 కోట్లకు చేరాయి. 2023 జనవరి ముగింపునాటికి మొత్తం ఫోలియోల సంఖ్య 14.28 కోట్లుకాగా, అవి ప్రస్తుతం 19 శాతం వృద్ధిచెందాయి. 2023 డిసెంబర్‌లో 16.49 కోట్ల ఫోలియో నంబర్ల నుంచి 3 శాతం పెరిగాయి. వ్యక్తిగత ఇన్వెస్టర్ల ఖాతాలకు డిజిగ్నేట్ చేసేవే ఫోలియో నంబర్లు. ఒకే ఇన్వెస్టరు ఎన్ని ఫోలియోలైనా తెరవవచ్చు. ఆర్థిక అక్షరాస్యత పెరుగుదల, అధిక ఆదాయాలు, డిజిటైజేషన్ విస్తృతితో దేశంలో ఇన్వెస్టర్లు సాంప్రదాయ పొదుపు సాధనాలైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టాఫీసు సేవింగ్స్ స్కీమ్స్‌కంటే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు మొగ్గు చూపిస్తున్నారని వైట్‌ఓక్ మ్యూచువల్ ఫండ్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ప్రతీక్ పంత్ చెప్పారు.

నవతరం నేతృత్వం

కొద్ది సంవత్సరాలుగా పెరుగుతున్న మ్యూచువల్ ఫండ్ ఫోలియోలకు కొత్త తరం జెన్-వై, జెన్-జడ్ ఇన్వెస్టర్లు నేతృత్వం వహిస్తున్నారు. 1981-1996 మధ్య జన్మించినవారు మిల్లెనియల్స్ (జెనరేషన్-వై ఇన్వెస్టర్లు) కాగా, 19997-2012 మధ్య పుట్టినవారిని జెన్-జడ్‌గా వ్యవహరిస్తుంటారు. కొత్త ఇన్వెస్టర్లలో అధికశాతం మ్యూచువల్ ఫండ్స్‌లోకి డిజిటల్ చానళ్ల ద్వారా ప్రవేశిస్తున్నారని పంత్ వెల్లడించారు. జనవరిలో వచ్చిన 46 లక్షల ఫోలియోల్లో 34.7 లక్షల ఫోలియోలు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌వే. మొత్తం ఫండ్ ఖాతాల్లో ఈక్విటీ ఫోలియోలు 11.68 కోట్లకు (69 శాతం వాటా) చేరినట్టు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తెలిపింది. డెట్ మ్యూచువల్ ఫండ్స్‌కంటే ఈక్విటీలపైనే మదుపుదారుల ఆసక్తి అధికంగా ఉందనడానికి ఇది నిదర్శనమని ఫండ్ విశ్లేషకులు చెప్పారు. 2024 జనవరిలో హైబ్రీడ్ ఫండ్స్ (డెట్, ఈక్విటీలు రెండింటిలోనూ ఇన్వెస్ట్ చేసేవి) 3.36 లక్షల ఫోలియోలు జతచేసుకోవడంతో వాటి మొత్తం ఫోలియోల సంఖ్య 1.31 కోట్లకు పెరిగాయి. మరోవైపు డెట్ స్కీమ్స్‌లో ఫోలియోల సంఖ్య వరుసగా ఐదో నెలలోనూ తగ్గింది. వీటి మొత్తం సంఖ్య 74.66 లక్షలకు పరిమితమయ్యింది. ఫోలియోల సంఖ్య కొద్ది సంవత్సరాల నుంచి ఎంతగా పెరిగినప్పటికీ, దేశంలో ఫండ్స్‌లో పెట్టేవారు చాలా తక్కువేనని పరిశ్రమ విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారత జనాభాలో మ్యూచువల్ ఫండ్ మదుపుదారులు 3 శాతంలోపేనని వారు గుర్తుచేశారు. ప్రస్తుత దేశీయ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలో రూ.53 లక్షల కోట్ల ఆస్తులు ఉన్నాయి.

నిఫ్టీ నయా రికార్డు

క్లోజింగ్, ఇంట్రా-డేల్లో ఆల్‌టైమ్ హైకి సూచీ

ముంబై, ఫిబ్రవరి 20: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో దూసుకుపోతున్నాయి. వరుసగా ఆరోరోజూ కొనుగోళ్ల మద్దతును కూడగట్టుకున్నాయి. మంగళవారం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ మరో సరికొత్త స్థాయిని అధిరోహించింది. అటు క్లోజింగ్, ఇటు ఇంట్రా-డేల్లోనూ ఆల్‌టైమ్ హై రికార్డులను నెలకొల్పింది. నిజానికి ఉదయం ఆరంభంలో సూచీలు తడబడినా.. ఆఖర్లో మెప్పించాయి. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 349.24 పాయింట్లు లేదా 0.48 శాతం ఎగబాకి 73,057.40 వద్ద నిలిచింది. నిఫ్టీ 74.70 పాయింట్లు లేదా 0.34 శాతం ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 22,196.95 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 22,215.60 స్థాయిని తాకి లైఫ్‌టైమ్ ఇంట్రా-డే హైని లిఖించింది. మొత్తానికి గడిచిన 6 రోజుల్లో సెన్సెక్స్ 1984 పాయింట్లు, నిఫ్టీ 580 పాయింట్లు పెరిగాయి.



రంగాలవారీగా..

బీఎస్ఈలో బ్యాంకింగ్ రంగ షేర్లు 1.23 శాతం లాభపడ్డాయి. ఆ తర్వాత రియల్టీ 1.13 శాతం, ఆర్థిక సేవలు 0.87 శాతం, యుటిలిటీస్, చమురు-గ్యాస్, క్యాపిటల్ గూడ్స్ రంగాల షేర్లు 0.66 శాతం మేర పెరిగాయి. అయితే మిడ్‌క్యాప్ సూచీ 0.17 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.18 శాతం చొప్పున నష్టపోయాయి. షేర్లవారీగా చూస్తే.. పవర్‌గ్రిడ్ అత్యధికంగా 4.16 శాతం పుంజుకున్నది. హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, కొటక్, ఇండస్‌ఇండ్, ఐసీఐసీఐ బ్యాంకుల షేర్లూ పెద్ద ఎత్తునే పెరిగాయి. ఎన్టీపీసీ, నెస్లే, హెచ్‌యూఎల్ షేర్లూ లాభపడ్డాయి. అయినప్పటికీ టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో షేర్లు క్షీణించాయి. కాగా, బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.391.50 లక్షల కోట్లు (4.72 ట్రిలియన్ డాలర్లు)గా ఉన్నది.

గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. ఆసియా మార్కెట్లలో హాంకాంగ్, చైనా సూచీలు లాభాల్లో ముగిశాయి. జపాన్ సూచీ నష్టపోయింది. ఇక విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) రూ.754.59 కోట్ల విలువైన షేర్లను అమ్మేశారు. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజ్ గణాంకాలు చెప్తున్నాయి. 'బ్యాంకింగ్ షేర్లు ఇటీవలి కాలంలో దిద్దుబాటుకు లోనయ్యాయి. కానీ ఇప్పుడు ఆకర్షణీయంగా మారాయి. ఇది స్టాక్ మార్కెట్ల లాభాలకు దోహదం చేసింది' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

ఐదు నిమిషాలకొక క్రెటా

ఎనిమిదేండ్లలో 10 లక్షల యూనిట్ల అమ్మకాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: దేశవ్యాప్తంగా స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాలకు డిమాండ్ అంతకంతకు పెరుగుతున్నది. లగ్జరీ లుకింగ్, సౌకర్యవంతంగా ఉండటంతో ఎగబడి కొనుగోళ్లు జరుపుతున్నారు కష్టమర్లు. ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ హ్యుందాయ్.. ఎనిమిదేండ్ల క్రితం దేశీయ మార్కెట్లోకి విడుదల చేసిన క్రెటాను ఎగబడి కొనుగోళ్లు జరుపుతున్నారు. 2015 నుంచి ఇప్పటి వరకు 10 లక్షల యూనిట్ల వాహనాలను విక్రయించింది. అంటే ఐదు నిమిషాలకొక క్రెటాను విక్రయించినట్లు అయింది. ఇటీవల సంస్థ అప్‌డేటెడ్ వెర్షన్ క్రెటాను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారుకోసం కూడా కష్టమర్లు క్యూ కట్టారు. ఇప్పటి వరకు ఏకంగా 60 వేలకు పైగా బుకింగ్‌లు వచ్చాయి. రూ.11 లక్షల ప్రారంభ ధరతో ఏడు రకాల్లో ఈ మాడల్‌ను మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది సంస్థ. కొత్త క్రెటా కారు కావాలంటే గరిష్ఠంగా ఏడు నెలలు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. అలాగే క్రెటాను ఇప్పటి వరకు 2.80 లక్షల యూనిట్లను ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేసింది. కియా సెల్టోస్, మారుతి గ్రాండ్ విటారా, టాటా హారియర్, మహీంద్రా స్కార్పియో-ఎన్, టయోటా అర్బన్ క్రూజర్, స్కోడా కుష్‌క్, ఫోక్స్‌వ్యాగన్ టైగూన్‌ల నుంచి క్రెటా తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నది.

50 వేలు దాటితే కస్టమ్స్ డ్యూటీ పెంపు

ఎలక్ట్రానిక్ వస్తువులపై విమానాశ్రయంలో విధింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): విమాన ప్రయాణికులు విదేశాల నుంచి తీసుకొచ్చే విలువైన వస్తువులపై కస్టమ్స్ డ్యూటీ చార్జీల్లో కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయి. మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్, ఐ పాడ్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల విలువ రూ.50 వేలు దాటితే ఇకపై 38.5 శాతం కస్టమ్స్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా సిగరెట్ ప్యాకెట్లపై 100 స్టిక్స్ కంటే తక్కువ ఉంటే సుంకం లేదని.. అంతకుమించితే 110 శాతం చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. అలాగే లిక్కర్, ఆల్కహాల్, వైన్‌లకు 2 లీటర్ల వరకు చార్జి చెల్లించాల్సిన అవసరం లేదని, కానీ అంతకు మించి ఉంటే 165 శాతం సుంకం చెల్లించాల్సి ఉంటుంది. అన్ని పైజుల టీవీలపైనా 38.5 శాతం, 1,000 గ్రాముల కంటే అధిక బరువు కలిగిన బంగారు ఆభరణాలపై 44 శాతం చెల్లించాలి.

తెలంగాణ స్టార్టప్‌కు జపాన్ దన్ను

రూ.1,336 కోట్ల ఓడీఏ రుణం

తెలంగాణలో స్టార్టప్‌లు, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాం. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాంతంలో సామాజిక, ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తాం. తద్వారా తెలంగాణ ప్రజల అభ్యున్నతికి తోడ్పడుతాం. నిజానికి ప్రపంచంలోనే ఓడీఏ రుణం ద్వారా స్టార్టప్‌లకు జికా మద్దతివ్వడం ఇదే తొలిసారి. స్టార్టప్‌లకు చేయూతనివ్వడంలో భారత్-జపాన్ మధ్య సహకారానికే ఇది దోహదం చేయగలదు.

-సైటో మిట్సునోరి,
జైకా ఇండియా ఆఫీస్ ప్రధాన ప్రతినిధి

హైదరాబాద్, ఫిబ్రవరి 20: దేశంలో ఆయా రంగాల్లోని పలు ప్రాజెక్టులకు రుణ సదుపాయాన్ని అందించేందుకు జపాన్ అంతర్జాతీయ సహకార ఏజెన్సీ (జైకా) ముందుకొచ్చింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో స్టార్టప్‌లు, నూతన ఆవిష్కరణల ప్రోత్సాహానికి మరింత దన్ను లభించింది. ఆ దేశ అధికారిక అభివృద్ధి సహాయ (ఓడీఏ) రుణాన్ని జైకా పొడిగించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో మంగళవారం ఓ కీలక భాగస్వామ్య రుణ ఒప్పందాన్ని జైకా చేసుకున్నది. దీని ప్రకారం రాష్ట్రంలో మెరుగైన స్టార్టప్ ఎకోసిస్టమ్, నూతన ఆవిష్కరణలు, ఉద్యోగ కల్పన, ఆర్థికాభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంలో తెలంగాణ ప్రభుత్వ సాధికారత కోసం దాదాపు రూ.1,336 కోట్ల రుణం అందుతున్నది.

మహిళలకు చేయూత

నగరాలు, పట్టణాల్లోని ఔత్సాహికుల కోసమేగాక గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, వ్యాపార ఆశావహులకు అండగా ఓ కార్యక్రమాన్ని వ్యూహాత్మకంగా రూపొందించారు. ఇందులో భాగంగానే ఈ ఓడీఏ రుణ సదుపాయం జికా నుంచి వస్తున్నది. పురుషులతో సమానంగా స్త్రీలకూ అవకాశాలు, ఆర్థిక చేయూత అందాలని కోరుకుంటున్నది. కాగా, ఈ రుణ ఒప్పందంపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి వికాస్ శీల్, జికి ఇండియా ప్రధాన ప్రతినిధి సైటో మిట్సునోరి సంతకాలు చేశారు.

మొత్తం రూ.13వేల కోట్లు

దేశంలో రహదారుల అభివృద్ధి, వాతావరణ మార్పులపై ప్రతిస్పందన, ఉద్యోనవ నాలు తదితర రంగాల్లోగల 9 ప్రాజెక్టులకు దాదాపు రూ.13,000 కోట్ల (232.21 బిలియన్ యెన్‌లు) ఓడీఏ రుణాన్ని ఇచ్చేందుకు జికా అంగీకరించింది. ఇందులో ఈశాన్య భారతంలోని మౌలిక రంగ ప్రాజెక్టులకూ రుణ సాయం అందనున్నది.

జైకాతో భారత్ ఒప్పందం గర్వకారణం

మా కృషికి దక్కిన ఫలితం

ఎక్స్ వేదికగా కేటీఆర్ సంతోషం

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): కొన్నేండ్లుగా తాము చేస్తున్న కృషి ఫలించినందుకు ఆనందంగా ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారక రామారావు సంతోషం వ్యక్తంచేశారు. ఉపాధి కల్పన, ఆర్థికాభివృద్ధి సవాళ్లను పరిష్కరించడానికి తెలంగాణ ప్రభుత్వానికి రూ.1,336 కోట్ల రుణం అందించేందుకు జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఏజెన్సీ (జైకా)తో భారత్ ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ఒప్పందం కుదరడం తమకు గర్వకారణమని పేర్కొన్నారు. ఇది దేశంలోని స్టార్టప్ రంగంలో జైకా సంస్థ పెడుతున్న మొదటి పెట్టుబడి అని తెలిపారు. 2019లోనే తెలంగాణ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను సందర్శించాలని జైకా ప్రతినిధి బృందాన్ని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రాజెక్ట్ రూపురేఖలను పరిశీలించిన తర్వాత, జైకా బృందంతో సంవత్సరాలపాటు నిరంతర చర్చలు, సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలో భారత్, జపాన్ అధికారులు అధికారిక ప్రకటన చేశారని వివరించారు.

హైరింగ్ తగ్గించం

టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కృతివాసన్

ముంబై, ఫిబ్రవరి 20: తాజా నియామకాల ప్రణాళికను తగ్గించాలన్న యోచన ఇప్పటివరకూ లేదని, అయితే ఐటీ సేవల డిమాండ్‌కు తగ్గట్టుగా తమ హైరింగ్ ఉంటుందని సాఫ్ట్‌వేర్ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) చీఫ్ ఎగ్జిక్యూటివ్ కృతివాసన్ చెప్పారు. కొన్ని కీలక మార్కెట్లలో డిమాండ్ మందగించినందున సాఫ్ట్‌వేర్ పరిశ్రమ నియామకాల్ని తగ్గిస్తున్నాయని, కొన్ని కంపెనీలు వాటి క్యాంపస్ ఆఫర్ల నుంచి కూడా వెనక్కు వెళుతున్నాయంటూ వార్తలు వెలువడిన నేపథ్యంలో కృతివాసన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ముంబైలో జరిగిన నాస్‌కామ్ సదస్సులో టీసీఎస్ చీఫ్ మాట్లాడుతూ 'ఆర్థిక వ్యవస్థలో గ్రీన్‌షూట్స్‌ను మేము ఇప్పటికే చూస్తున్నా